హైదరాబాద్ వార్త



# విద్యుత్ అంతరాయాలకు చెక్..

**-అందుబాటులోకి ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం**
**-స్కాడా ప్రధాన కేంద్రంకు అనుసంధానం**
**-సిబ్బందిని ఎప్పటికప్పుడు అలర్ట్ చేసే అవకాశం**
**-కేంద్ర కార్యాలయం నుంచే ఉన్నతాధికారుల మానిటరింగ్**




**హైదరాబాద్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్పిడిసిఎల్) సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సబ్ స్టేషన్లలో తరచూ తలెత్తే సాంకేతిక సమస్యలు సహా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ఈదురుగాలితో కూడిన వర్షానికి ఫీడర్ ట్రిప్ అవుతుండటం, షార్ట్సర్క్యూట్ కారణంగా అండర్ గ్రౌండ్(యూజీ) కేబుల్స్, ఎయిర్ బంచడ్ (ఏబీ) కేబుల్స్ జాయింట్ల వద్ద తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరాపై సీఎండీ మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అలర్ట్ చేసే ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం (ఎఫ్ఎంఎస్) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్నసూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్వజేషన్ (స్కాడా)కు అనుసంధానం చేసింది. దీంతో ఏ సబ్ స్టేషన్లోని ఫీడర్.. ఏ సమయంలో ట్రిప్ అయింది.. ఏ ప్రాంతానికి... ఎంత సమయం కరెంట్ సరఫరా నిలిచిపోయింది.. సరఫరాను ఎన్ని గంటల్లో పునరుద్ధరించారు.. వంటి సమగ్ర సమాచారం ఉన్నతాధికారులకు చేరవేస్తోంది. ముఖ్యంగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి పెద్ద సంఖ్యలో ఫీడర్లు ట్రిప్పవుతుంటాయి. ఒకేసారి అనేకప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ సమయంలో ఎవరైనా వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్సెంటర్ (ఎస్ఓసీ) సహా 1912/ లేదా క్షేత్రస్థాయి జేఎల్ఎం, ఏఈలకు సమాచారం ఇస్తే కానీ సంబంధిత అధికారులకు విషయం తెలిసేది కాదు. సాంకేతిక సమస్య గుర్తింపు క్షేత్రస్థాయి సిబ్బందికి పెద్ద సమస్యగా మారేది. అర్ధరాత్రి జోరున కురిసే వర్షం లోనూ లైన్ టు లైన్ తిరగాల్సి వచ్చేది. సమస్యను గుర్తించి, సరఫరాను పునరుద్ధరించేందుకు రెండు మూడు గంటల సమయం పట్టేది. ఇంట్లో కరెంట్ లేకపోవడంతో వినియోగదారుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చేవి. ఈ సమయంలో సీఎండీ సహా ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఫోన్ చేసి ఆరా తీస్తే.. సరైన కారణం చెప్పే వారు కాదు. కొంత మందైతే ఏకంగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే వారు. ఇది వారికి తలనొప్పి గా మారేది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టంతో తలెత్తిన సాంకేతిక సమస్యతో పాటు సరఫరా పునరుద్ధరణ వెంటనే తెలిసిపోతుంది. కేంద్ర కార్యాలయాల్లో కూర్చొనే క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరును మానిటరింగ్ చేసే వెసులుబాటు కలుగుతుంది.

**గ్రేటర్లో 3,421 ఫీడర్లు..**

గ్రేటర్ పరిధిలో 11 కేవీ ఫీడర్లు 3,421 వరకు ఉన్నాయి. వీటిలో 1,353 ఫీడర్లను ఇప్పటికే ఈ ఎఫ్ఎంఎస్ రిధిలోకి తీసుకొచ్చింది. ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లోనే తెలుసుకునే అవకాశం ఉంది. ఐదురోజుల క్రితం భారీ ఈదురుగాలితో కూడిన వర్షానికి గ్రేటర్ లో 449 ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఈ ఎఫఎంఎస్ సహకారంతో 410 ఫీడర్ల పరిధిలో అర గంటలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో హిందీనగర్, ఆలియాబాద్, బ్యాంక్ కాలనీ సహా హబ్సీగూడ సర్కిల్ పరిధిలో బోడుప్పల్, సూర్యహిల్స్ కాలనీ ఫీడర్ల పరిధిలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రాగాటూల్స్, రైతుబజార్, మేడిబావి, ఆర్పీనిలయం, ఈ ఎంఈ ఫీడర్ల పరిధిలోనూ సాంకేతిక సమస్యలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎస్ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరాను పునరుద్ధరించడంతో పాటు తలెత్తిన సాంకేతిక సమస్యలను గుర్తించి, వ్యవస్థను చక్కదిద్దే పనులు చేపట్టారు.

# హనుమాన్ శోభాయాత్రకు భారీగా పోలీసు బలగాలు




ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో భారికేడ్లను ఏర్పాటు చేసిన దృశ్యం



శోభాయాత్ర సందర్భంగా ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో భారీగా పోలీసుబలగాల మోహరింపు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** హనుమాన్ శోభాయాత్ర శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ యాత్రకు భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ఆర్టీసి క్రాస్‌రోడ్స్ మీదుగా శనివారం అట్టహాసంగా సాగింది. సరిగ్గా ర్యాలీ రెండు గంటల ప్రాంతంలో ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌కు చేరుకున్న శోభాయాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. జైశ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ కార్యకర్తలు, ప్రజలు పెద్దపెట్టున నినాదాలిచ్చారు. చిక్కడపల్లి నుంచి ఆర్టీసిక్రాస్ రోడ్స్ నుంచి అశోక్ నగర్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది స్థానిక ప్రజలు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. నగర అదనపు పోలీసు కమిషనర్( లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావళి, అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) విశ్వప్రసాద్,డిసిపి (హెడ్ క్వార్టర్స్) రక్షిత, డిసిపి చైతన్య, అదనపు డీసీపీ ఆనంద్, అదనపు డీసీపీ(ట్రాఫిక్) రామ్‌దాస్ తేజావత్, చిక్కడ పల్లి ఏసీపీ ఎల్.రమేశ్ కుమార్, చిక్కడపల్లి, ముషీరాబాద్, దోమలగూడ ఇన్స్పెక్టర్లు రాజు నాయక్, రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి, చిక్కడపల్లి డిఐఇ.శేఖర్, చిక్కడపల్లి ఎస్ఐలు నాగరాజు, అభిలాష్, మోనిక, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు. రామ్‌నగర్, గాంధీనగర్ కార్పొరేటర్లు రవిచారి, ఎ. పావనీ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బిజెపి నగర నాయకుడు ఎ. వినయకుమార్‌తో పాటు పీస్ కమిటీ సెంట్రల్ జోన్ కార్యదర్శి కృష్ణశర్మ, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. క్రాస్‌రోడ్స్ నాలుగుదార్లు మూసివేసి కేవలం ర్యాలీ వెళ్లేడానికి వీలుగా ఏర్పాట్లు చేసి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న బాలలు హనుమాన్ వేషదారణలతో అందరి దృష్టిని ఆకర్షించారు. అంతా చిన్న పిల్లలే ఈ నృత్యాలు చేస్తూ హనుమాన్ శోభాయాత్రకు నిండుదనం తీసుకువచ్చారు. ర్యాలీలో వచ్చిన అన్ని వాహనాలను ఆపి దాదాపు ఐదారుసార్లు కాషాయ జెండాను ఊపి ర్యాలీలో పాల్గొన్న వారికి ఘనస్వాగతం పలికారు. క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో వాటర్ క్యానన్లతో పాటు, పలు ప్లటూన్ల పోలీసులతో పాటు సబ్ఇన్స్పెక్టర్‌లు, ఇన్‌స్పెక్టర్‌లు, పోలీసుకానిస్టేబుళ్లు, హోంగార్డులు, హెడ్కానిస్టేబుళ్లతో ప్రత్యేక సెక్యురిటీ సిబ్బందితో పాటు చిక్కడపల్లి మైత్రి సంఘం సభ్యులు బందోబస్తులో పాల్గొన్నారు. కాగా హనుమాన్ శోభయాత్ర ఫలితంగా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు పోలీసులు వాహనాల దారిమళ్లింపు చేపట్ట డంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. మొత్తంగా ర్యాలీ ప్రశాం తంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# జై శ్రీరామ్..

**-సంబురంగా హనుమాన్ శోభాయాత్ర**







**హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

జై శ్రీరామ్..జై హనుమాన్ నినాదంతో భాగ్యనగరం మార్మోగింది. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా గౌలిగూడలోని శ్రీరామ మందిరం నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. గౌలిగూడ రామందిరం, కర్మాన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ నుంచి ప్రారంభమైన హనుమాన్ విజయయాత్ర తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు సాగింది. దారి పొడవునా భక్తులు జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.స్థానికులు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి ప్రసాదాలు పంపిణి చేశారు.12 కిలోమీటర్ల యాత్రకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్ గౌలిగూడలోని శ్రీరామ మందిరానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.కాగా హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాలతోపాటు రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అన్ని ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు.

## తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్‌కు ప్రీతిజింటా



**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతి జింటా తాడ్‌బండ్ వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం తాడ్‌బండ్ హనుమాన్ ఆలయానికి వచ్చిన ప్రీతి జింటా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఉప్పల్ వేదికగా హైదరాబాద్ సన్‌రైజర్స్‌తో పంజాబ్ కింగ్స్ తలబడనుంది. ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ విజయాన్ని కోరుతూ ప్రీతిజింటా వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

## వక్ఫ్ సవరణ చట్టం చేయడమంటే ముస్లింల హక్కులను కాలరాయడమే




సమావేశంలో మాట్లాడుతున్న వి.హనుమంతరావు. చిత్రంలో సయ్యద్ అజీజ్‌పాషా, సుధాకర్, వినోద్‌రెడ్డి తదితరులు

**సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం చేయడమంటే ముస్లింల హక్కులను కాలరాయడమే కాదని, ఎస్సీ,ఎస్టీ,బిసి, అనగారిన వర్గాలకు రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగానికి తూట్లు పోడవడమేనని పలువురు వక్తలు ఆగ్రహాం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం-2024ను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు సయ్యద్ అజీజ్‌పాషా, మాజీ ఎంపి వి.హనుమంతరావు, టిపిసిసి ఉపాధ్యక్షుడు ఎంజిఆర్ వినోద్‌రెడ్డి, సిపిఎం నేత అబ్బాస్, ఎంఐఎం మాజీ ఎమ్మెల్సీ సయ్యద్ జాఫ్రీ, టిజెఎసి నగర ఉపాధ్యక్షుడు అఫ్జల్, ఆప్ నేతలు సుధారాణి విజయ్, మల్లంగి, జావీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదని, ఇది భారత లౌకిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా మతా లు, కులాల పేరిట దేశాన్ని విభజించడమేనని ఆరోపించారు. వక్ఫ్ సవరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కోటి వినతులను స్వీకరించినట్లు చెప్పాడం హా స్యాస్పదంగా ఉందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం పేరుతో కేంద్రం తలదూర్చడం సరైన పద్దతి కాదన్నారు. భవిష్యత్తులో ఇతర మత సంస్థలకు సంబంధించిన అంశాల్లో తలదూర్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు.

## ఆస్తి కోసం కూతురిని చంపిన సవతి తల్లి

**-సహకరించిన ,మేనబావ సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్, స్నేహితుడు**
**-మిస్టరీ ఛేదించిన మేడిపల్లి పోలీసులు**

**మేడిపల్లి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త ;** ఆస్తి దక్కించుకోవాలనే దుర్బుద్ధి తో సవతి తల్లి పలువురితో కలిసి కూతురిని అమానుషంగా హత్య చేసి వాగులో పూడ్చిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లక్ష్మీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న జాటోత్ మహేశ్వరి (26) అనే యువతి తండ్రి జాటోత్ పీనా నాయక్ తో కలిసి ఉంటుంది.గత డిసెంబర్ 7వ తారీఖున అదృశ్యం కావడంతో బందువులు,తెలిసిన ఇండ్లలో వెతికిన జాడ తెలియకపోవడంతో ఈ నెల 2న తండ్రి జాటోత్ పీనా నాయక్(55) మేడిపల్లి పోలీసులకు ఫీర్యాదు చేశారు.పీర్యాదు అందుకున్న పోలీసుల దర్యాప్తులో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి.జాటోత్ పీనా నాయక్ (55) ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు.అతని మొదటి భార్యతో విడాకులు తీసుకున్నాడు .పీనా నాయక్,లలితను మరో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది.మొదటి బార్య కూతురు మహేశ్వరికి వివాహం చేశారు. కొన్ని కారణాల వల్ల మహేశ్వరి కి విడాకులు జరిగాయి.పీనా నాయక్ కు బోడుప్పల్ ప్రాంతాలో రెండు ఇండ్లు ఉన్నాయి. మహేశ్వరికి మళ్ళీ పెళ్ళి చేయాలని నిర్ణయించుకొని ఒక ఇళ్ళు ఇవ్వాలని తండ్రి నిర్ణయించాడు. దీంతో రెండు ఇండ్లు తన కూతురికే కావాలి అని లలిత ప్లాన్ తో మహేశ్వరిని అంతం చేయాలని పథకం పన్నింది. లలిత మేన బావ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రవికి విషయం చెప్పడంతో లలిత,రవి,అతని స్నేహితుడు వీరూ నాయక్ ముగ్గరు కలిసి గత డిసెంబర్ 7న మహేశ్వరి తండ్రి పీనా నామక్ ఉద్యోగంకు వెళ్లిన సమయంలో మహేశ్వరిని హత్య చేశారు.అనంతరం సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రవి స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మల గ్రామానికి దగ్గర్లోని నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామం ప్రాంతంలో అదే రాత్రి 11 సమయంలో మహేశ్వరి శవాన్ని పూడ్చిపెట్టారు.సుమారు నాలుగు నెలలు కావోస్తున్న మహేశ్వరి జాడ తెలియక పోవడంతో తండ్రి పీనా నాయక్ మేడిపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో సవతి తల్లి లలిత, మేన బావ రవి, మరో వ్యక్తి సహాయంతో మహేశ్వరిని హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తేలింది. నిందితులు చెప్పిన సమాచారంతో వంగమర్తి గ్రామ శివారులో మూసి బ్రిడ్జి కింద పిల్లర్ నెంబర్ వన్ వద్ద మహేశ్వరి మృతదేహం లభించింది.దీంతో పోలీసులు మృతదేహన్ని పోస్ట్ మార్టం చెయించి రక్త సంబంధీకులకు అప్పగించారు.నిందితులను రిమాండ్ కు తరలించామని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డి తెలిపారు.

## చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

**మలక్ పేట ,ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**

చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. రాజును నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఇన్ స్పెక్టర్ రాజును సస్పెండ్ చేయడం జరిగిందని తెలిసింది. ఇన్ స్పెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన బ్రహ్మ మురారి చాదర్ఘాట్ ఇన్ స్పెక్టర్ ఎం. రాజును సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో నూతన ఇన్ స్పెక్టర్ గా బ్రహ్మ మురారి పదవి బాధ్యతలు చేపట్టారు.

## తెలుగుభాషలో ప్రత్యేకమైన గొప్ప ప్రక్రియ అవధానం




సంపూర్ణ శతావధాన సభలో ప్రసంగిస్తున్న వాణీదేవి, నిత్యానందరావు, శ్రీరంగాచార్య, దత్తాత్రేయశర్మ తదితర అతిథులు

**నాంపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** పద్యం భారతీ హృదయ పద్మం, పద్యం తెలుగువాని రసవాజ్యం, సంస్కృతీ వైభవాల వైషజ్యం, హృద్యమాద్యం, స్వజన అర్పిత సాధునైవేద్యం, సర్వదా విభుదవేద్యం, దండం పద్యవిద్యకు అన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అవధానం తెలుగుభాషకే మకుటాయమానమని తొలి అవధాని కోలాచల మల్లినాథ వేదికలో జరిగిన సంపూర్ణ శతావధాన ప్రారంభసభలో తన సందేశంలో పేర్కొన్నారు. అవధానమంటే ధార, ధారణ, ధోరణి, ధీ, ధైర్యం.. ఈ ఐదింటితో కూడుకున్నదన్నారు. తెలుగుజాతికి ఎంతకీ తరగని సారస్వత సంపద అవధానం ప్రక్రియ తెలుగువారికి కొట్టిన పిండి, ఇంతగొప్పటి సంపూర్ణ శతావధానం నిర్వహించుకొంటున్న ఈరోజు తెలుగువారికి పండుగరోజేనని రమణాచారి అభిప్రాయపడ్డారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజ-పద్యం, అవధాన విద్యావికాస పరిషత్ సంయుక్త నిర్వహణలో నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో మూడురోజులపాటు శతావధాన షడానన, శతావధాన పూర్ణచంద్ర డా. మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం కవులు, పండితులు, అవధానులు, అశేష సాహితీప్రియుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభం కాగా అవధానం తెలుగుభాషకే ప్రత్యేకం, మకుటాయమానమని, దీనిని భావితరాలకు అందించాలన్న సత్సంకల్పంతో నిర్వహించడం శ్లాఘనీయమని తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావులు అన్నారు. ప్రభుత్వాలు కూడా సాహితీప్రియులకు సమాజంలో సముచితస్థానాన్ని కల్పించి అవధానంలాంటి అత్యుత్తమ ప్రక్రియలను ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. శనివారం ఉదయం జరిగిన సంపూర్ణ శతావధానం ప్రారంభోత్సవ సభలో పెరంబుదూరు శ్రీరంగాచార్య, వనం జ్వాలా నరసింహారావు, మరుమాముల వెంకటరమణశర్మ, అయాచితం శ్రీధర్, నిర్వాహకులు నారుమంచి వెంకటకృష్ణ, మరుమాముల దత్తాత్రేయశర్మ, ఉభయ తెలుగు రాష్ట్రాల సాహితీ ప్రముఖులు పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుండి వందలాదిమంది కవి పండితులు విచ్చేగా మొదటిరోజు ఉదయం మాడభూషి వెంకటాచార్య వేదికలో జీ.ఎం.రామశర్మ శతావధాని అధ్యక్షతన, మధ్యాహ్నం డా. రేవూరి అనంతపద్మనాభరావు అధ్యక్షతన తిరుపతి వెంకటకవుల వేదికలో డా. మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం నిర్విఘ్నంగా కొనసాగింది. రేపు రెండవరోజు ఆదివారం ఉదయం 9నుండి కొప్పరపు సోదర కవుల వేదిక; మధ్యాహ్నం 3నుండి సిరిసినహళి కృష్ణమాచార్య వేదికలలో కొనసాగి 14న ఉదయం 9నుండి గౌరీభట్ల-గుమ్మనగారి వేదిక, మధ్యాహ్నం 3 నుండి అష్టకాల-అయాచితం వేదికలలో సంపూర్ణ శతావధానం ముగుస్తుందని, సాయంత్రం 5గంటలకు డా. మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధాన విజయోత్సవ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు




**పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ స్టేడియంలో సందడి**

## మొలక పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీనివాస్‌రెడ్డి



మొలక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్‌రెడ్డి

**సైఫాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** సీనియర్ జర్నలిస్టు వేదంత సూరి ఆధ్వర్యంలో బాలల కోసం ముద్రిస్తున్న మొలక మాస పత్రికను పది సంవత్సరాల నుంచి నడుపుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ మాస మొలక పుస్తకాన్ని శనివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల కోసం ఇలాంటి పుస్తకాలు నడపడం అభినందనీయమని అన్నారు. వేదాంత సూరి సీనియర్ జర్నలిస్టు మా పత్రికలో పనిచేశారని, తాను బాల్యంలో ఉన్నప్పుడు పావలా, అర్ధరూపాయి పెట్టి చందమామ, బాలమిత్ర అనే పుస్తకాలను పోస్టులో తెప్పించుకుని చదువుకునే వాళ్లమని చెప్పారు. మొలకను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి అభివృద్ధిలోకి తీసుకురావాలని, ఈ పత్రికకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు కె.విరాహత్‌ఆలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణరెడ్డి, నాయకులు వై.నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్‌లో హనుమాన్ జయంతి వేడుకలు



చంపా దర్వాజ శ్రీ హనుమాన్ మందిరంలో జరిగిన ఉత్సవాలలో పాల్గొన్న కమిటి ప్రతినిధులు విశాల్ కేడియో, జితేందర్, అనిల్

**చార్మినార్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని షక్కర్‌కోట, కోకరివాడి, ఝూలా, పురానాపూల్, దూద్ బౌలి, ఘాన్సీ బజార్, మామాజుమ్లా పాఠక్, మీరాలంమండి, దూద్‌బౌలి, శాలిబండతో పాటు పలు ప్రాంతాలలో శనివారం అత్యంత వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు జరిగాయి. పలు ప్రాంతాలలో శోభా యాత్రలను నిర్వహించారు. చంపా దర్వాజ శ్రీ హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన విశాల్ రథ యాత్ర ఘాన్సీ బజార్‌లోని ప్రాంతాలు మీదుగా కొన సాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి ప్రతినిధులు సుచిత్ర అగర్వాల్, విశాల్ కేడియో, జితేందర్, అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా హిందూ ధర్మ ప్రేమీ సంస్థ ఆధ్వర్యంలో ఘాన్సీ బజార్‌లో శనివారం శ్రీ హనుమాన్ జయంతి నిశాన్ యాత్ర జరిగింది. పలువురు బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు సందర్బంగా పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

### హనుమాన్ జయంతిల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



లాలాపేట్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పజ్జన్న

**తార్నాక, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శనివారం సికింద్రాబాద్ నియోజక వర్గంలోని తార్నాక డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తార్నాక డైరీ ప్రాంతంలోని హనుమాన్ నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ జయంతి శోభా యాత్రను ప్రారంభించారు. లాలాపేట తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకల్లో పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాత్మికత, అన్నీ విలువల ప్రేరణకు హనుమంతుడు స్ఫూర్తిగా నిలుస్తాడని అన్నారు. హనుమాన్ జయంతి ర్యాలీలు సాఫీగా నిర్వహించుకొనేలా పోలీసులు సహకరించాలని సూచించారు. యువ నేత కిశోర్ కుమార్ గౌడ్, సునీల్ ముదిరాజ్‌తో పాటు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## శోభాయాత్రకు పుష్పాలతో ముస్లిం పెద్దలు స్వాగతం



వివిధ రకాలతో పుష్పాలతో స్వాగతం పలికేందుకు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ వద్ద ముస్లీం మతపెద్దలు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన శోభాయాత్ర సందర్బంగా ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గతంలో ఎవ్వరూ చూడని విధంగా ఎవరూ ఊహించనివిధంగా శోభాయాత్ర సందర్భంగా మతసామరస్యాన్ని కాపాడేందుకు ముస్లీంలు పెద్దసంఖ్యలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌కు చేరుకోవడమే కాకుండా వివిధ రకాల పుష్పాలతో యాత్రలో పాల్గొన్న వారికి స్వాగతం పలికారు. దీంతో కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఎంతో ఆనందంతో ఊగిపోయారు.

## నకిలీ వైద్యులు పట్టివేత

**అల్వాల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** అర్హత లేకున్నా అలోపతి వైద్యులుగా చలామణి అవుతున్న పలువురు నకిలీలు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలులో బయట పడ్డారు. అల్వాల్‌లో శనివారం తెలంగాణా రాష్ట్ర వైద్య ఆరోగ్య మండలి వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, సభ్యుడు డా ఇమ్రాన్‌లు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. అల్వాల్‌తో పాటుగా మల్కాజిగిరిలో తనిఖీలు చేశారు. అనుమతి లేని వ్యక్తులు నిర్వహిస్తున్న వైద్య కేంద్రాలు వెలుగులోకి వచ్చాయి. ఓల్డ్‌అల్వాల్ లోని గాయత్రి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ద్వారా గణేష్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నాడు. భువన ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ఎం.వేణుగోపాల్, గౌరవీ క్లినిక్‌ను సమంత(బిఎంఎంఎస్)లు పట్టుబడిన వారిలో ఉన్నారు. అనధికారికంగా ఇన్‌పేషెంట్ బెడ్లు ఏర్పాటు చేయడంతో పాటుగా యాంటీ ఎపిలెప్టిక్ మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. నకిలీ వైద్యులుపై ఎన్‌ఎంసి, టీఎస్‌ఎంపిఆర్ చట్టాలు ప్రకారం పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అనధికారిక క్లీనిక్‌లపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో బాగంగా అర్హత లేని నకిలీ వైద్యులను గుర్తించి చర్యలు తీసుకోవడం వైద్య ఆరోగ్య మండలి ప్రధాన ఎజెండా అని ఆయన స్పష్టం చేశారు. నకిలీ వైద్యులకు సంబంధించిన సమాచారాన్ని వాట్సప్ ద్వారా 91543 82727 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



బోయిన్‌పల్లిలో హన్‌మాన్ జయంతి ర్యాలీకి స్వాగతం పలుకుతున్న బిజెపి నేతలు బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు



హన్‌మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కూన శ్రీశైలం గౌడ్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్



తిరుమలగిరిలో స్వామిని దర్శించుకున్న తెలుకుంట సతీష్ గుప్తా



ప్రత్యేక పూజలు జరుపుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక



నామాలగుండు హనుమాన్ దేవాలయంలో దర్శనం చేసుకున్న ఆదం సంతోష్‌కుమార్ తదితరులు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పద్మారావుగౌడ్ తదితరులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హనుమాన్ జయంతి సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో బాగ్ అమీర్ బాలాంజనేయ స్వామి ఆలయంలో లక్ష తమలపాకుల అర్చనలలో పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు దంపతులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండి రమేష్



హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



షక్కర్‌గంజ్‌లోని శ్రీ దాస ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు



వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్



హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్



పర్వత్‌నగర్‌లో హనుమాన్ శోభ యాత్రలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీజేపి సెక్రటరీ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్.



మణికొండలో హనుమాన్ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి



హన్‌మాన్‌మందిరంలో పూజలు చేసిన టిపిసిసి లింగ్విస్టిక్‌మైనార్టీసెల్ చైర్మన్ మురళీమోహన్ సింగ్



హనుమాన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పరపల్లిలో నిర్వహించిన హనుమాన్ బైక్ ర్యాలీలో పాల్గొన్న బాల్ రెడ్డి

# వైభవంగా హనుమన్ జయంతి...భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

## ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :**

నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోతే మీకు నరకం చూపిస్తా.. మిమ్మల్ని రోడ్డుకీడుస్తా.. స్వయంగా నా చేతులతో మిమ్మల్ని అంతం చేస్తా అంటూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులను బెదిరించిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారా హిల్స్ రోడ్ నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో నివాసముంటున్న ఎమ్మెల్సీ విజయశాంతి, ఆమె భర్త శ్రీనివాస్ ప్రసాద్‌లకు నాలుగేళ్ల నుంచి ఎం.చంద్రకిరణ్ రెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఉన్నది. సోషల్ మీడియాలో ప్రమోషన్, కంటెంట్ తయారీ తదితర పనులు ఉచితంగా చేసి పెడుతామంటూ చంద్రకిరణ్ రెడ్డి చెప్పాడు. మీకు చేస్తున్న ప్రమోషన్ కార్యక్రమాలను ఉపయోగించుకుని వేరే కస్టమర్లను తయారు చేసుకుంటారంటూ పలు మార్లు చెప్పడంతో విజయశాంతి అంగీకరించారు. దీంతో చంద్రకిరణ్ రెడ్డి బీజేపీలో ఉన్నన్ని రోజులు సోషల్ మీడియా కంటెంట్ తయారుచేసి ఇచ్చారు. అయితే అతడి పనితీరు వల్ల పెద్ద గా ఉపయోగం లేక పోవడంతో కొన్నేండ్ల తర్వాత ఆపేశారు. కాగా బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన తర్వాత చంద్రకిరణ్ రెడ్డి తనకు రావాల్సిన బకాయి ఇవ్వాలంటూ మెసేజ్ పెట్టారు. దీంతో షాక్‌కు గురైన శ్రీనివాస్ ప్రసాద్ ఉచితంగా సేవలు ఇస్తానని చెప్పి డబ్బులు అడగడం ఏంటి అని ప్రశ్నించారు. ఈ క్రమంలో నాలుగురోజుల క్రితం మరో మెసేజ్ పెట్టిన చంద్రకిరణ్ రెడ్డి తీవ్ర పదజాలంతో హెచ్చరికలు జారీ చేశాడు. తనకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించకపోతే..`మీరు నా శత్రువులుగా భావిస్తానని, మిమ్మల్ని రోడ్డు మీదకు లాగుతానని, మిమ్మల్ని అత్యంత క్రూరమైన పద్ధతులతో అంతు చూస్తానంటూ..అని మెసేజ్‌లో పేర్కొన్నాడు. అతడి బెదిరింపులు తీవ్రస్థాయిలో ఉన్నాయని, రాజకీయ ప్రేరేపితంగా కనిపిస్తున్నాయని ఎమ్మెల్సీ విజయశాంతి భర్త శ్రీనివాస్ ప్రసాద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి తీసుకున్న అనంతరం చంద్ర కిరణ్‌రెడ్డి మీద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

## నియోజకవర్గాల పునర్విభజనపై రౌండ్ టేబుల్ సమావేశం



డీలిమిటేషన్ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న పిఇపి అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

**గోషామహల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా నియోజవర్గాల పునర్విభజనలో దక్షిణ భారత దేశానికి నష్టంజరుగకుండా కాపాడు కోవడంతోపాటు రావాల్సిన హక్కులు వాటాను సాధించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఇందు కోసం రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలు సమిష్టిగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈమేరకు గౌలిగూడ ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గాల పునర్విభజనపై అవగాహన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా, సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ యాక్టివిస్ట్ నేలంటి మధు సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో సామాజిక, పాత్రికేయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురువక్తలు పాల్గొన్ని నియోజకవర్గాల పునర్విభజన అంటే ఏమిటి? అనే అంశంపై మొదలుకుని దాని పూర్వపరాలు,.జనాభా ఆధారంగా జరిగే పునర్విభజన పట్ల దక్షిణ భారత దేశానికి కలిగే నష్టాలు, ఉత్తర భారత దేశ పార్టీలు మనపట్ల చూపుతున్న వివక్ష తదితర అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు జరిగేనష్టాలు, పరిపాలనలో పార్లమెంట్‌లో మనకు జరుగుతున్న నష్టాన్ని అడ్డుకుంటూ మన అధికారాలు, హక్కులనుపొందడం గురించి చర్చించారు. చైన్నెలో మార్చిలో జరిగిన ముఖ్యమంతుల సమావేశం తర్వాత జరిగిన పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పని చేయనున్న డీలిమిటేషన్ జెఏసితో కలిసి ప్రజల్లో ఈ అంశంపై పట్ల చైతన్యం కలిగించాలని, తమ పార్టీ శ్రేణులతో కూలంకుషంగా చర్చించి పార్టీ వైఖరిని కార్యాచరణను ప్రకటిస్తామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. సాత్ ఇండియా జాగో అన్న నినాదంతో తమ పార్టీ పని చేస్తుందని సూచన ప్రాయంగాప్రకటించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక వేత్త చికిలేమధుబాబు, బిజెపి నేత ఉపేంద్ర ప్రసాద్‌దూబె, బోనాల వ్యాపార వేత్త బోనాల శేషాసాయి, నరేష్ దుత్వాల, ఎంకె. నరేందర్, సల్ల శ్రీశైలం యాదవ్, మహేష్, రాజుసుత్రేన్ తదితరులుపాల్గొన్నారు.

### హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వి రామారావునగర్‌లోని శ్రీశ్రీశ్రీ వినాయక శివపార్వతి హనుమాన్ నాగదేవత నవగ్రహ దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగుల సత్యం, సుభాష్‌రెడ్డి, యాదగిరి, సంజీవ, సత్యనారాయణ, రాము, కిష్టయ్య, రఘుపతి, నర్సింగ్‌రావు, బస్తీ అధ్యక్షులు వెంకటయ్య యాదవ్, పాల్గొన్నారు.

**సబ్దార్‌నగర్‌లో :** హనుమాన్ జయంతి సందర్భంగా సబ్దార్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, వేణుగోపాల్, బొల్లు శ్రీనువాస్‌రావు, రోనంకి జగన్నాథం, అగతముడి రమేష్, నర్సింహ, బ్రహ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, జగ్జీవన్‌రాంల ఆశయ సాధనకు కృషి చేద్దాం - మాజీ సర్పంచ్ యాలాల నరేష్



మణికొండలో అంబేద్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నార్సింగి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :**

దళిత జాతి అభ్యున్నతికి అహర్నిషలు కష్టపడ్డ అంబేద్కర్, జగ్జీవన్‌రాంల ఆశయ సాధనకు కృషి చేద్దామని మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ పేర్కొన్నారు. శనివారం మణికొండలోని శివాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో అంబేద్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ దళితుల ఆరాధ్య దైవాలు అంబేద్కర్, జగ్జీవన్‌రాంలు అని పేర్కొన్నారు. వారి కృషి వల్లనే నేడు దళితులు విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లను పొంది రాణిస్తున్నారన్నారు. తరతరాల వెట్టి చాకిరి నుంచి దళితులు ఇప్పుడిప్పుడే కోలుకొని ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారన్నారు. అణగారిన వర్గాలలో జన్మించి అంబేద్కర్ భారత రాజ్యాంగంను రచించారని, జగ్జీవన్‌రాం ఉప ప్రధానిగా పని చేసి దళితుల రిజర్వేషన్లను అమలు అయ్యేలా చేశారన్నారు. వారి ఆశయ సాధనకు నేటితరం యువత అంతా నడుం బిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ఏర్పుల కుమార్, లక్ష్మీశ్రీ, నాయకులు శ్రవణ్, విజయరెడ్డి, గంగాధర్, నాయకులు రమేష్, బుబు, నర్సిహ్మా, నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా "గ్లోబల్‌ట్రీ ఎడ్యుకేషన్ ఫెయిర్ "



ఎడ్యూకేషన్ ఫెయిర్‌కు హాజరైౖ విద్యార్థులు

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

యుకెలోని వివిధ కాలేజీల్లో చేరేందుకు నగరంలోని గ్లోబల్ ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్యూకేషన్ ఫెయిర్ ఉత్సాహంగా సాగింది. శనివారం నగరంలోని ఓహోటల్‌లో నిర్వహించిన ఈకార్యక్రమానికి సుమారు 750కిపైగా విద్యార్థులు హాజరై యూనివర్సిటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమానికి యుకెలోని లేబర్ పార్టీ సీనియర్ నాయకుడు వీరేంద్ర కుమార్ శర్మ హాజరై భారతీయ విద్యార్థులకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. గ్లోబల్‌ట్రీ వ్యవస్థాపకుడు శ్రీకర్ ఆలపాటి మాట్లాడుతూ విద్యార్థులకు సాధ్యమైనంత ఉత్తమంగా సహాయం చేయడానికి ప్రముఖ అంతర్జాతీన సంస్థలను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఐఎస్‌యుఏ చైర్‌పర్సన్ సనమ్ అరోరా పాల్గొన్నారు

## తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడగడంతో మాజీ ప్రియురాలికి వేధింపులు

**హైదరాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :**

ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు.. అమ్మాయి ఓకే చెప్పడంతో ఆమె నుంచి డబ్బులు తీసుకుని జల్సాలు చేశాడు. చివరకు అతని బాగోతం తెలిసి వదిలేస్తే వేధింపులకు గురిచేశాడు. రోడ్డుపై అటకాయించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో విసిగిపోయిన బాధిత యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణానగర్‌కు చెందిన ఓ యువతి(30) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఆమెకు అదే ప్రాంతానికి చెందిన సుమంత్ (30) అనే యువకుడితో గత పదేళ్లుగా పరిచయం ఉంది. ఇద్దరూ కొంతకాలం ప్రేమించుకున్నారు. అతన్ని పెళ్లి చేసుకుని నిండు నూరేళ్ల జీవితాన్ని హాయిగా గడపాలని సదరు యువతి భావించింది. ఈ క్రమంలో సుమంత్ అడగ్గానే రూ.5లక్షల దాకా ఇచ్చింది. అయితే, ఇటీవల సుమంత్ తాగుడుకు బానిసయ్యాడు. సుమంత్ తాగుడుకు బానిస కావడంతో అతన్ని సదరు యువతి పక్కనబెట్టింది. దీన్ని జీర్ణించుకోలేని సుమంత్ ఆమె వెంటపడి వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే తనను విడిచిపెట్టాలని సదరు యువతి సుమంత్‌కు సూచించింది. అలాగే తాను ఇచ్చిన రూ.5లక్షలను కూడా తిరిగి ఇచ్చేయాలని కోరింది. కానీ ఆమె మాటలను పట్టించుకోని సుమంత్..ఆమె వచ్చిపోయే మార్గంలో అటకాయించి వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన సదరు యువతి శనివారం నాడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆర్థిక ఇబ్బందులతో గ్రాఫిక్ డిజైనర్ ఆత్మహత్య

**నార్సింగి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో ఓ గ్రాఫిక్ డిజైనర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గండిపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన పత్తి సతీష్ కుమార్(37) తన తల్లి పత్తి భారతితో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు ఆరేళ్ల పాటు హెటిరో ఫార్మసిలో గ్రాఫిక్ డిజైనర్‌గా పని చేశాడు. అక్కడ టీం లీడర్‌తో వచ్చిన గొడవల కారణంగా ఉద్యోగం మానేశాడు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తుపై ఆందోళనతో మద్యానికి బానిసయ్యాడు. డిప్రెషన్‌గా గురయ్యాడు. శుక్రవారం రాత్రి 11.గంటలకు ఇంటికి వచ్చిన సతీష్ తన తల్లి వద్దకు వెళ్లి నీ చేతులతోనే తినిపించాలని అడిగాడు. ఆ తరువాత కొద్ది సమయం తరువాత వద్దని చెప్పి గదిలోకి వెళ్లాడు. బ్యానర్ బట్టతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. 12.గంటల ప్రాంతంలో భారతి తన కుమారుడిని లేపి తినిపించాలని అనుకొని తలుపు కొట్టగా లోపలి నుంచి స్పందన రాలేదు. అదనపు తాళంచెవిని ఉపయోగించి లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ఆ బ్యానర్ బట్టను కట్ చేసి చూడగా కదలికలు లేవు. స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. తాము మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

**అత్తాపూర్ ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు యువత పాల్గొని రక్తదానం చేయాలని శ్రీ అయ్యప్ప స్వామి సేవ సమితి సభ్యులు పేర్కొన్నారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ అయ్యప్ప స్వామి సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం రోజున శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కొరకు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8..30 నుండి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని రక్త దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయ్యప్ప స్వామి సేవ సమితి సభ్యులకు కోరారు..

## శరవేగంగా పీర్జాదిగూడ పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులు



ఫిర్జాదిగూడ పర్వతాపూర్ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న తుంగతుర్తి రవి, అధికారులు

**మేడిపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ పర్వతాపూర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. విస్తరణలో భాగంగా పలు విద్యుత్ స్తంభాలను తొలగించడం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ల రీప్లేస్మెంట్ పనులను సంబంధిత అధికారుల సమక్షంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నత్తనడక నడిచిన రోడ్డు విస్తరణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శరవేగంగా చురుకుగా సాగుతున్నాయని పీర్జాదిగూడ పర్వతాపూర్ ప్రజల సౌకర్యార్థం వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ నాణ్యతలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు తుంగతుర్తి రవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈ లింగయ్య, ఎఈ సత్యనారాయణ రెడ్డి, లైన్మెన్ భాస్కర్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : కిరణ్ కుమార్



మారుతి మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు చిట్టింపల్లి కిరణ్ కుమార్ ,గౌని చంద్రయ్య, బొట్టు శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట,ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని దిల్ షుక్ నగర్ మారుతి మందిర్ కమిటీ సభ్యులు చిట్టెంపల్లి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ మారుతి మందిర్ లో శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ సభ్యులు చిట్టింపల్లి కిరణ్ కుమార్, బొట్టు శ్రీనివాస్, గౌని చంద్రయ్య నరేందర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం సురేందర్ రెడ్డి, ప్రవీణ్, దేవాలయం ఇఒ రవీందర్ రెడ్డి, సూపర్ వైజార్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగలను కలిసిమెలిసి శాంతియుతంగా జరుపుకోవాలి -ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి



ఓల్డ్ మాలక్ పేట లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు బాబు సుదర్శన్ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ప్రజలందరూ కలిసి మెలిసి పండుగలను శాంతియుత వాతావరణం లో ప్రశాంతంగా జరుపుకోవాలని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి పేర్కొన్నారు. ఓల్డ్ మాలక్ పేట రేస్ కోర్స్ రోడ్డులోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను దేవాలయం కమిటీ అధ్యక్షులు బాబు సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి దేవాలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం కమిటీ అధ్యక్షుడు బాబు సుదర్శన్ ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారిని శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీనివాస్, కమిటీ సభ్యులు అమర్ నాథ్ గౌడ్, నరసింహారావు, ఎం. శ్రీనివాస్, చుక్క కృష్ణ, ఏ. వెంకటేష్ ,నరేందర్, యాదగిరి పాల్గొన్నారు.

### దైవభక్తి ఉన్నవారికే ఆలయ కమిటీలో స్థానం: కేఎల్ఆర్



చైర్మన్ రమేష్‌ను సన్మానిస్తున్న కేఎల్ఆర్, భాస్కర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** దైవభక్తి, దేవుడి పట్ల నమ్మకం ఉన్న వారికే దేవాలయం కమిటీలో స్థానం కల్పించామని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా కేఎల్ఆర్, భాస్కర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలన్న ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సిద్ధంగా ఉన్నారన్నారు. నూతన పాలకవర్గ చైర్మన్ తలాటి రమేష్ నేత సహా 13మంది సభ్యులు కలిసి కట్టుగా గుడి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ చైర్మన్ తలాటి రమేష్‌నేత, పాలకవర్గ సభ్యులు బొడ్డుపల్లి మహేందర్, సాయికుమార్, ఉమామహేశ్వరి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌గుప్తా, మారం సుజాత, సురేందర్రావు, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, అన్నపూర్ణ, శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, బండి మధు, ధన్‌రాజ్‌గౌడ్, మాజీ చైర్మన్ జగిని రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### సబితా ఇంద్రారెడ్డి చొరవ వల్లే అల్మాస్‌గూడ శేషాద్రినగర్‌లో రోడ్ల నిర్మాణం: సంరెడ్డి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ శేషాద్రినగర్ కాలనీలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవ వల్లే రోడ్ల నిర్మాణాలు జరిగాయని మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సబితారెడ్డి కాలనీలో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారనీ ఆ తర్వాత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణాలను ప్రారంభించారని ఆయన వెల్లడించారు. అయితే ఇప్పుడు రోడ్ల నిర్మాణం పూర్తి అయితే కొందరు కాంగ్రెస్ నాయకులు తమ ఘనత అని ప్రచారం చేసుకోవడం సరికాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో మంజూరైన రోడ్లు కావనీ అంతకు ముందు ఉన్న బిఆర్ఎస్ పాలనలో మంజూరైన రోడ్లను ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా హనుమాన్ జయంతి....శోభాయాత్రలు



గడ్డి అన్నారంలోని శ్రీ భక్త హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్, లింగాల వేణు గౌడ్ తదితరులు



హనుమాన్ శోభ యాత్రలో పాల్గొన్న ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ, సందడి సురేందర్ రెడ్డి, మాడిగల లక్ష్మారెడ్డి తదితరులు



హనుమాన్ జయంతి సందర్భంగా బి.యన్.రెడ్డి.నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ సాహెబ్ నగర్ లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హనుమాన్ జయంతి సందర్భంగా సాహెబ్ నగర్ లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి కమిటీ ఫౌండర్ చైర్మన్ కొత్త శ్రీధర్ గౌడ్ దంపతులు అభయ ఆంజనేయ స్వామి కి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.



సాహెబ్ నగర్ లో శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.



శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



అంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎల్బీనగర్ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



హనుమాన్ జయంతి వేడుకల్లో స్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



బాలాపూర్ దేవతలగుట్ట హనుమంతునికి పూజలు చేస్తున్న సబితా ఇ oద్రారెడ్డి



దేవతలగుట్టపై పూజలు చేస్తున్న మాజీ మేయర్ పారిజాత



బాలాపూర్ గ్రామ హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

## ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ నేతల సంవిధాన్ ర్యాలీ




ఉప్పల్‌లో సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, కోఆర్డినేటర్ బజారు జగన్నాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారాయన్నారు. అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ శాంతినగర్‌లోని పలు మీదుగా పలు కాలనీల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు లుకాస్, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, సుంకు శేఖర్‌రెడ్డి, అలీం, ఖాజా, మౌలానా, సుధాకర్, నవీన్ యాదవ్, గోవింద్, రాజేందర్‌రెడ్డి, వర్కల మధన్‌గౌడ్, నర్సింగ్, వెంకటేష్, జహంగీర్, మహేష్, రాఘవేంద్ర, హనుమంతు, బాకారం అరుణ్, అనిల్‌కుమార్, జనగామ రామకృష్ణ, రాంరెడ్డి, ఉప్పల్ డివిజన్ యూత్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, నవీన్‌గౌడ్, బచ్చరామ్, కిషోర్ పాల్గొన్నారు.

## మీర్‌పేట్ నందిహిల్స్‌లో రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నంది హిల్స్‌లో హెచ్ఎండిఎ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంత్రిగా ఉన్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హెచ్ఎండిఎ నుండి నందిహిల్స్ రోడ్ నెంబర్ 1, 2 లలతో రోడ్డు నిర్మాణం కోసం హెచ్ఎండిఎ నుండి నిధులు మంజూరు చేయించారు. అయితే ఎట్టకేలకు రూ. 75 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర భ్ంగా స్థానిక నాయకులు రామిడి నర్సిరెడ్డి, హేమునాయక్, నందిహిల్స్ ఫేజ్-1 కాలనీ అధ్యక్షుడు ఆనందం, రవీందర్‌నాయక్, సురేష్‌గుప్త, రాజేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, విజయలక్ష్మి, పాండునాయక్ విష్ణు, పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేసి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సేవ చేయడం అంటే భూమికి రుణం తీర్చుకోవడమే : అశోక్ కుమార్ స్వైన్



320హెచ్ డిస్టిక్ సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్గా ఘన విజయం సాధించిన లయన్ అశోక్ కుమార్ స్వైన్

**కుషాయిగూడ,ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ఇతరులకు సేవ చేయడం ద్వారా భూమిపై జన్మించినందుకు భూమాతకి రుణం రుణం తీర్చుకున్నట్టు అవుతుందని డిస్టిక్ 320 హెచ్ రెండవ వైస్ డిస్టిక్ గవర్నర్ ప్రముఖ సంఘ సేవకులు లయన్ అశోక్ కుమార్ స్వైన్ పేర్కొన్నారు.గత 20 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నోబుల్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్విరామంగా నిరంతరాయంగా చేపడుతూ హైదరాబాదు నగరంలోనే కాకుండా అనేక ప్రాంతాల్లో గుర్తింపు పొందిన ప్రముఖ సంఘ సేవకులు లయన్ డిస్టిక్ జీఎస్టి కోఆర్డినేటర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ జరిగిన జిల్లా రెండవ వైస్ డిస్టిక్ గవర్నర్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో సుబ్బారావు పై గెలుపొందారు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవుల కోసం కాకుండా ఆత్మ తృప్తి కోసం ఇతరులకు సేవ చేయడం అనే తత్వాన్ని జీవితంలో అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు స్తోమత కలిగిన ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో ఎంతో తృప్తి లభిస్తుందన్నారు. గత 20 సంవత్సరాలుగా వ్యక్తిగతంగా లైన్స్ క్లబ్ ద్వారా కోట్లాది రూపాయల పర్మనెంట్ ప్రాజెక్టులను చేపట్టి ప్రజలకు విద్యార్థులకు ఆపదలో ఉన్న వృద్ధులకు సేవార్దులకు ఆపన్నులకు అందించిన సేవ కార్యక్రమాల అందరి చల్లని ఆశీస్సుల మూలంగా రెండవ వాయిస్ డిస్టిక్ గవర్నర్గా ఘనవిజయం కట్టిపెట్టారని అశోక్ కుమార్ సైన్ స్పష్టం చేశారు. నా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి మరిన్ని గొప్ప సేవా కార్యక్రమాలు చేసి కృతజ్ఞతలు తెలుపుతానన్నారు.

### కెప్టెన్ వీర రాజారెడ్డి పార్కు అభివృద్ధికి కృషి : ఎంపి ఈటల



హబ్సిగూడ వీరరాజాజిరెడ్డి పార్కు దశాద్ధి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** హబ్సిగూడ రవీంద్ర నగర్‌లోని కెప్టెన్ వీర రాజిరెడ్డి పార్కు దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు రుద్ర శేఖర్, కార్యదర్శి ఎ.రాఘవరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ వీర రాజిరెడ్డి పార్కు స్థాపించి పదేళ్లు పూర్తి కావడం అభినందనీయమన్నారు. పార్కులో చిన్నారులు, వృద్దులకు తగు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కులో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేశారని తెలిపారు. వీర రాజారెడ్డిని స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత జి.రవీందర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రఘుప్రసాద్, కెప్టెన్ హర్మిజిత్‌సింగ్, పలువురు బిజెపి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**- చింతల అరుణా సురేందర్ యాదవ్**

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** నీటి సమస్య అలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. సహభావన టౌన్‌షిప్‌లో నీళ్ల సమస్య ఉందని కార్పొరేటర్ చింతల అరుణసురేందర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ తన సొంత నిధులతోటి రూ.2.60 లక్షలతో బోర్ వేయించారు. ఈ ఆమె మాట్లాడుతూ రాను న్న రోజులలో నీళ్ల సమస్య తలెత్తకుండా దాన్ని దృష్టిలో పెట్టుకొని నీళ్లను పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### సిఎం సహాయనిధి పేదలకు వరం : అరవింద్‌శర్మ



కేశవులుకు చెక్ అందజేస్తున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిది నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. జిల్లెలగూడకు చెందిన సున్నాల కేశవులు అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స చేయించుకున్నాడు. చికిత్స అనంతరం ముఖ్య మంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 37,500 మంజూరు కాగా ఆ చెక్కును శనివారం సున్నాలా కేశవులు కు అరవింద్ శర్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి ఉపాధ్యాయుల సత్కారం



దయానంద్‌గుప్తను సన్మానిస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** డాక్టర్ అంబేద్కర్ జయంతి, జ్యోతి రావు పూలె జన్మదిన వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం కొత్తపేటలోని ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్ గుప్తాని కలిసి శాలువాతో సత్కరించారు. ఆదివారం జరిగే ఈ కార్యక్రమంలో 100 ప్రైవేట్ ఉపాధ్యాయులకు జరిగే సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ హెల్త్‌క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ, చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, శివకుమార్, మల్లేశం, రాహుల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



బిఆర్ఎస్ రజోత్సవ సభ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కాలేరు జైనవీన్ తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, పలువురు కార్పొరేటర్లు కలిసి అవిష్కరించారు. హబ్సిగూడ బిఆర్ఎస్ సీనియర్ నేత కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పోస్టర్‌ను వారు అవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున నాయకులు తరలివస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, కె. సోమిరెడ్డి, డా.చారి, బి.కైలాసపతిగౌడ్, పిల్లి నాగరాజు, నెర్ధం భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వన్ డే వన్ థీమ్ కార్యక్రమంలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కమీషనర్ సరస్వతి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

### ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నాట్య గురువు నల్లమోలు శ్రీలక్ష్మి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, పుష్పాంజలి, నటేశకౌతం, తరంగం, అన్నమాచార్య కీర్తనలు, కాలబైరవాష్టకం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు పుష్ప, అరోహి, అద్విక, హరిణి, హవ్య, జోషిత, కాశ్వి, కుందన,మధులిక, రియా, సంహిత, సంవిక, శ్రేయ, తన్మయి తదితరులు తమ ప్రదర్శనలతో ఆహుతులను మెప్పించారు. కళారత్న నాట్య గురువు డా.ఎస్‌పి భారతి, టివి నటుడు రాగిడి, వీరభద్రరావు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను సత్కరించారు.

### బహిరంగ సభలో అధిక సంఖ్యలో పాల్గొనాలి -ఎమ్మెల్యే బిఎల్ఆర్




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

**నాచారం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ పిలుపు మేరకు చలో వరంగల్ బహిరంగ సభ ఉప్పల్ నియోజకవర్గం స్థాయి సన్నాక సమావేశం మల్లాపూర్ డివిజన్ వివిఆర్ ఫంక్షన్ హాల్లో శనివవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు అధినేత కేసిఆర్ పిలుపుమేరకు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం అన్ని డివిజన్లో నుండి ఉద్యమ నాయకులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా అధ్యక్షురాలు మహిళ నాయకురాలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు : సిఐటియు

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం సిఐటియు కార్యాలయంలో ఇన్సూరెన్స్ కార్డులు అందజేశారు. మేడ్చల్ జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఇసుక అన్‌లోడింగ్ కార్మికులకు చేయూత అందించినట్లు తెలిపారు. సిఐటియు నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పథకాలు మరిన్ని పెంచాలని కోరారు. సంక్షేమ పథకాలు పేదలకు చేరే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు జి.పట్టాభిరామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

### దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం : శిల్పారెడ్డి

**ఉప్పల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్‌లో బిజెపి డివిజన్ కార్యదర్శి అడెపు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు బిజెపి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్, పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.



హనుమాన్ జయంతిలో కాషాయపతాకాన్ని ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)